# బి జోన్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ బ్రోచర్ను ఆవిష్కరించిన ప్రిన్సిపాల్



**రామగిరి-నవభూమి:** హైదరాబాద్ జేఎన్టీయూ కు అనుబంధంగా ఉన్న బి జోన్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ బ్రోచర్ను సోమవారం మంథని జేఎన్టీయూ కళాశాల ప్రిన్సిపాల్ బి విష్ణువర్ధన్ ఆవిష్కరించారు. మార్చి 6 నుంచి లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తున్న టోర్నమెంట్కు గతంలో కళాశాలలో చదువుతూ క్రికెట్ టీంకు ప్రాతినిధ్యం వహించిన విద్యార్థులు, కళాశాల యాజమాన్యం ఆర్థిక సహాయం అందిస్తుంది. ఇట్టి టోర్నమెంట్లో ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాలకు చెందిన జేఎన్టీయూ హైదరాబాద్ యూనివర్సిటీ అనుబంధ ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులు పాల్గొంటున్నారు. బయటి కళాశాలల టీంలకు ఉచితంగా భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి సుమన్, ఫిజికల్ డైరెక్టర్లు పింగిళి కృష్ణారెడ్డి, సునీల్, నిర్వహకులు కార్తికేయ, నిఖిల్, విద్యార్థులు పాల్గొన్నారు

# కులగణన సర్వే రెమ్యూనరేషన్ చెల్లించాలి

### టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బలాష్టి రమేష్



**మహబూబాబాద్ టౌన్, మార్చి 3, నవభూమి:** తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టిపిటిఎఫ్) మహబూబాబాద్ జిల్లా కార్యకర్తల సమావేశం జిల్లా కార్యదర్శి రాచకొండ ఉపేందర్ అధ్యక్షతన స్థానిక టిపిటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షులు బలాష్టి రమేష్ మాట్లాడుతూ, నవంబర్ 6 నుండి 20 వరకు నిర్వహించిన కులగణన సర్వేకు సంబంధించిన డేటా ఎంట్రీ ప్రక్రియ పూర్తయిందని, డిసెంబర్ 5, 2024న '»Pro.Rc.No.6280/Bodjet/Scheme/SEEEPCS /2024-25" ద్వారా Director of Economics and Statistics, Hyderabad వివిధ జిల్లాలకు నిధులు మంజూరు చేసినప్పటికీ, ఇప్పటికీ ఎన్యుమరేటర్లకు, సూపర్వైజర్లకు రెమ్యూనరేషన్ అందలేదని తెలిపారు. తక్షణమే అధికారులు స్పందించి చెల్లింపులు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పులిచింత విష్ణువర్ధన్ రెడ్డి, మహబూబాబాద్, కొరివి మండలాల ప్రధాన కార్యదర్శులు సారెడ్డి లింగారెడ్డి, ఓదెల శివకుమార్, టిపిటిఎఫ్ మండల కమిటీ సభ్యులు గోనిగంటి శ్రీనివాస్, కోడూరి శ్రీనివాస్, గోనే కార్తీక్ తదితరులు పాల్గొన్నారు

# కెఎస్ రామారావుని సన్మానించిన మంత్రి తుమ్మల

**ఖమ్మం మార్చి 3 నవభూమి ప్రతినిధి:** ఖమ్మం నయా బజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గా పనిచేస్తూ ఫిబ్రవరి 28న ఉద్యోగ విరమణ పొందిన కెఎస్ రామారావు ని రాష్ట్ర వ్యవసాయ, కోపరేటివ్, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలలెక్చరర్ల సంఘానికి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులుగా, ప్రిన్సిపాల్స్ సంఘానికి రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన రామారావు ఇంటర్ విద్య బలోపేతానికి విశేషంగా కృషి చేశారు. ఉద్యోగ విధుల్లో మంచి పేరున్న రామారావు ఖమ్మంలో ఎందరికో సుపరిచితులు. ఒక మంచి ప్రిన్సిపాల్ని, మరో నిజాయితీ పరుడైన మంచి సీనియర్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సన్మానించారని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు.

# దర్జాగా ప్రభుత్వ భూమి కబ్జా

- 316 లో 3 ఎకరాలు మాయం
- పూర్తిగా ప్రైవేటు పరమవుతున్న అసైన్డ్
- అసైన్డ్ రికార్డు కొంత కబ్జా కొండంత
- అసైన్డ్ దారులే విక్రయాలకు సూత్రదారులు
- ప్లాట్లుగా చేసి నోటరీ డాక్యుమెంట్లతో విక్రయాలు
- శంకర్పల్లి మండలంలో జోరుగా దందా
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు
- పీడీ యాక్ట్ కేసు నమోదు చేసి భూమి స్వాధీనం చేసుకోవాలని స్థానికులు వినతి





**చేవెళ్ల, మార్చి 03 నవభూమి :** ప్రభుత్వ భూములు కబ్జా గురవుతున్నాయి. మరోవైపు ప్రభుత్వం పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. ఇంత అక్రమాలు జరుగుతుంటే ప్రభుత్వ భూములను కాపాడాల్సిన మండల రెవెన్యూ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. జరిగిన అక్రమాలను చూస్తుంటే అధికారులె అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కోట్లు విలువచేసే ప్రభుత్వ భూములు కబ్జాకు గురై ఏళ్లు గడుస్తున్నా.. రెవెన్యూ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. మరోవైపు గతంలో ప్రభుత్వం నిరుపేదలకు కేటాయించిన అసైన్డ్ భూముల్లో ఇప్పుడు రియల్టర్లు తిష్ట వేస్తున్నారు. నిబంధనల మేరకైతే ప్రభుత్వం ఇచ్చిన భూమిని ఎవరికీ అమ్మకూడదు. అసైనీ తదనంతం వారి వారసులకే దానిపై హక్కులుంటాయి. వారూ లేకుంటే ప్రభుత్వమే భూమిని స్వాధీనం చేసుకుంటుంది. కానీ చిత్రంగా శంకర్పల్లి పట్టణ కేంద్రంలోని సర్వే నెంబర్ 316లో గల అసైన్డ్ భూముల్లో సుమారు 20ఎకరాల అసైన్డ్ భూమి ప్రైవేట్ వ్యక్తులకు దారదత్తం చేశారు అసైన్డ్దారులు . ప్రభుత్వ భూమి పెద్ద ఎత్తున ఆక్రమణకు గురైంది. వివరాలోకి వెళితే శంకర్పల్లి పట్టణం హైదరాబాద్ నగర శివారు ప్రాంతం కావటంతో ఈ మండలంలో ఇంటి స్థలాలకు పెద్ద ఎత్తున డిమాండ్ నెలకొంది. మారు మూల గ్రామాల్లో సైతం వెంచర్లు పుట్టుకు వస్తున్నాయి. భూముల ధరలు ఎకరం కోట్లలో పలుకుతుంది. వెంచర్లలో ఎక్కువ ధర పెట్టి ప్లాట్లు కొనుగోలు చేయడం సాధ్యం కానివారు తక్కువ ధరకు అసైన్డ్ స్థలాలను కొనేందుకు మొగ్గుచూపుతున్నారు. ఇదే అదనుగా కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొంత పట్ట భూమి కొనుగోలు చేసి, పక్కనే ఉన్న ప్రభుత్వ భూములను కబ్జా చేసి ప్లాటింగ్, రోడ్డు వేసి చౌక ధరకే ఇంటి స్థలాలు అంటూ ప్రచారం చేసి అమాయక జనానికి విక్రయించి కోట్లు గడిస్తున్నారు. శంకర్పల్లి గ్రామ రెవెన్యూ సర్వే నెంబర్ 229 లో 12 -21ఎకరాల పట్టాభూమిలో 4 ఎకరాలు రైల్వే లైన్ కోసం ప్రభుత్వం తీసుకోగా, సర్వేనెంబర్ 229 లో మిగిలిన 8 ఎకరాల 21 గుంటల పట్టాభూమి, 230, 231 సర్వేనెంబర్ లలో 11 ఎకరాల పట్టా భూమిలో లేఔట్ నిర్మించారు నగరానికి చెందిన ఓ రియల్టర్ వెంచర్ నిర్వాహకుడు. ఇక్కడే ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది. ఈ వెంచర్ కు ఆనుకుని ఉన్న సర్వేనెంబర్ 316 లో సుమారు 3ఎకరాల ప్రభుత్వ పోరంబోకు భూమిని సదరు వెంచర్ నిర్వాహకుడు కబ్జా చేసి వెంచర్ లో కలిపేసుకున్నాడు. అసైన్డ్భూములు రిజిస్టర్ అయ్యే ఛాన్స్లేకపోవడంతో నోటరీ పేపర్లపై అమ్మకాలు కొనసాగిస్తున్నారు.కబ్జా చేసిన ఈ భూమిలో ప్లాట్లు చేసి వెంచర్ నిర్వాహకుడు అమాయకులకు అంటగట్టి భారీగా సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి . ఇదిలా ఉండగా కొందరు రియాల్టర్లు అసైన్డ్ భూములలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు. శంకర్పల్లి పట్టణ కేంద్రంలో 100 ఎకరాల ప్రభుత్వ భూమిలో గతంలో 30 మందికి అసైన్డ్ పట్టాలిచ్చారు. వీటిలో సగానికి పైగా భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లాయి. రికార్డుల్లోని అసైన్డ్దారులు ఎవరూ భూములను సాగు చేసిన దాఖలాలు లేవు.ఈ భూములను కొందరు అసైన్డ్ దారులే రియల్టర్లకు లీజ్ అగ్రిమెంట్ పేరుతో విక్రస్తున్నారు. ఈ అసైన్డ్ భూములో నుంచే నిర్మాణాలు చేపట్టారు. జీవో 58, 59 సాకుతో ఈ భూముల్లో నిర్మాణాలకు ప్రయత్నిస్తున్నారు. ఇంత పెద్ద ఎత్తున ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతుంటే శంకర్పల్లి మండల రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు.

సాక్షాత్తు మండల రెవెన్యూ కార్యాలయ కేంద్రంలోనే ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందన్న వార్తపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అక్రమణల వెనుక రెవెన్యూ అధికార యంత్రాంగం, రాజకీయ నేతల అండదండలు పుష్కలంగా ఉన్నాయనే ప్రచారం కొనసాగుతుంది. శంకర్పల్లి మండలపరిధిలోని అసైన్డ్ భూములు పెద్దఎత్తున చేతులు మారాయన్న ప్రచారం జోరుగా సాగుతుంది . రాష్ట్ర ప్రభుత్వం అసైన్డ్ స్థలాలను సైతం క్రమబద్ధీకరిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో విక్రయాలు జోరందుకున్నాయి.

**400 ఎకరాల అసైన్డ్ భూములు**

శంకర్పల్లి, మొయినాబాద్ మండలంలో సుమారు 400 ఎకరాల అసైన్డ్ భూములు ప్రైవేట్ పరమయ్యింది. 1983-11996లో ప్రభుత్వ భూములను స్వాతంత్ర సమరయోధులు, మాజీ సైనికులు, నిరుపేదలకు అసైన్మెంట్ కింద కేటాయించారు. మొయినాబాద్, శంకర్పల్లి మండలాలు హైదరాబాద్కు దగ్గరగా ఉండడంతో పెద్ద పారిశ్రామికవేత్తలు, రాజకీయ నాయకులు, పోలీసు ఉన్నతా అధికారులు అసైన్డ్ భూములను కొనుగోలు చేసి తోటలు, ఫార్మ్హౌస్ లు, గెస్ట్హౌస్ లను నిర్మించుకున్నారు. శంకర్పల్లి మండల పరిధిలో సుమారు 200 ఎకరాల అసైన్డ్భూములు ప్రైవేటు వ్యక్తులకు దారా దత్తం అయినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. శంకర్పల్లి పట్టణ కేంద్రంలో కొందరు రియాల్టర్ లు ఈ అసైన్డ్ భూములలోంచి వెంచర్లకు దారులు వేసుకున్నారు. ప్రైవేట్ వ్యక్తుల పరమైన ప్రభుత్వ భూమిని ఇంతవరకు ఒక్క ఎకరం కూడా ప్రభుత్వం వెనక్కు తీసుకోకపోవడం గమనార్హం.

**అసైన్డ్ ను యథేచ్ఛగా ప్లాట్లు చేసి విక్రయాలు**

అసైన్డ్దారుల నుంచి చట్టవిరుద్ధంగా భూములు కొన్న రియల్టర్లు 150 గజాల చొప్పున ప్లాట్లు చేసి పేదలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. శంకర్పల్లి పట్టణకేంద్రంలో అసైన్డ్ దారులు పెద్దఎత్తున అసైన్డ్ భూమి ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేశారు. అసైన్డ్ భూములను వంద గజాల చొప్పున ప్లాట్ల చేసి అమ్మేశారు. శంకర్పల్లి పట్టణకేంద్రంలో సర్వేనెంబర్ 316లో అంతా ప్రభుత్వం పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములే. ఓ వెంచర్ నిర్వాహకుడు చట్ట విరుద్ధంగా అసైన్డ్ దారులకు నయానా భయాన ఇచ్చి సుమారు 3 ఎకరాలు తన వెంచర్ లో కలుపుకుని ప్లాటింగ్ రోడ్లు వేసి, కొనుగోలు చేసిన అసైన్డ్ భూమి చుట్టూ గోడతో కాంపౌండ్ కట్టి ఆక్రమించేశాడు. కొంత అసైన్ భూమిలో ఇళ్ల నిర్మాణం కూడా జరిగింది.

**అక్రమాలకు కేరాఫ్ శంకర్పల్లి**

శంకర్పల్లి మండలం అసైన్డ్భూముల అక్రమ విక్రయాలకు కేరాఫ్ అడ్రస్ గా మారింది. చిన్న శంకర్పల్లి గ్రామ పరిధిలోనే 100 ఎకరాల భూమిని ప్రభుత్వం అసైన్మెంట్ కింద పలువురికి కేటాయించింది. ఈ భూములు ఇప్పటికే చేతులు మారగా రెవెన్యూ రికార్డుల్లో మాత్రం అసైనీల పేర్లే వస్తున్నాయి. రికార్డుల్లో అసైన్డ్ ఉండటంతో రైతుబంధు, రైతుభరోసా వంటి ప్రభుత్వ పథకాలు లబ్ది చేకూరుతుంది.కాని వాస్తవంలో ఈ భూముల్లో ఏ విధమైన సాగు, అనుభవంలో లేరు అన్నది వాస్తవం. పైగా ఈ అసైన్డ్ భూములను ప్రైవేటు వ్యక్తులకు లీజ్ రూపంలో విక్రయించారు.

**నోటరీపైనే లావాదేవీలు**

అసైన్డ్భూములు రిజిస్టర్ అయ్యే ఛాన్స్లేకపోవడంతో నోటరీ పేపర్లపై అమ్మకాలు కొనసాగిస్తున్నారు. నోటరీపై అమ్మకాలు చేస్తున్నప్పటికీ రెవెన్యూ రికార్డుల్లో మాత్రం అసైన్డ్ రైతుల పేర్లే కొనసాగుతాయి. భూమిని విక్రయించినవారు గదుల నిర్మాణం, కరెంట్ కనెక్షన్, ఇంటి నంబర్లకు అదనంగా వసూలు చేస్తున్నారు. అసైన్డ్ భూముల్లో నిర్మించిన ఇళ్లకు ఇంటి నంబర్లు ఎలా ఇస్తున్నారనే ప్రశ్నకు అధికారుల వద్ద సమాధానం లేదు. నోటరీ డాక్యుమెంట్పై కొన్న స్థలాలను క్రమబద్ధీకరిస్తామని ఇటీవల ప్రభుత్వం ప్రకటించడంతో అక్రమార్కులకు మరింత ఊతం ఇచ్చినట్లైంది. దీనిపై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని గ్రామస్తులు కోరుతున్నారు

